# మానవుడు

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

చీకటి రాత్రులూ వెన్నెల రాత్రులూ భేదమే తెలియడం లేదు. వెధవ ఎలక్ట్రిక్ దీపాలు!
మ్యునిసిపాలిటీవాళ్ళకు బుద్ధిలేదు.
ఈ మారుమూలవీధిలో కూడా ఎలక్ట్రిక్ దీపమే.
మామూలువాటికంటే కాంతిమంతంగా కూడా ఉంది.
ఈ మేడగల ఆసామీ పలుకుబడీ, ప్రయోజకత్వమే
అయి ఉంటుంది.
కానీ—అదేమిటో మనమూ చూద్దాము.
కావలసినవాళ్లు లైటు పెట్టించుకొంటారు,
అక్కరలేనివాళ్లు, ఇబ్బందిగా ఉన్నవాళ్లు,
తీయించేస్తారు.
ఒకళ్ళచేత తీయించడం ఏం ఖర్మం?
మన పని మనం చేసుకున్నంత సుఖం మరేదీ లేదు.
ఎక్కడా ఒక్క చిన్న రాయిముక్క కనబడి తగలడదేం?
హుం! తారురోడ్డట తారురోడ్డు!
కారు సున్నగా తేలిగ్గా పాములాగా సాగిపోవాలిట!
నడిచేవాళ్ళ కాళ్ళకి వేడితారు అంటుకొన్నా
మంచిదేనట!
వెధవ రాయికోసం రెండు ఫర్లాంగులు నడుస్తామా?
అయితే మరి సాధనాంతరం?
జేబులు గాలించడం—
ఏదయినా ఆయుధం దొరక్కపోదు.
ఒక్క అణా కాసుంది.
అణాకాసంటే అరకప్పు 'టీ'
నాలుగు చుట్టలు, ఎనిమిది బీడీలు, ఇంకా ఇంకా...
ఉహుం తప్పదు—అంతే.
పెట్టుబడి లేని వ్యాపారం అంటూ ఉండదు.
సరే, ఇక, మరి, కర్తవ్యం?
పనీపాటూ లేనివాడెవడూ సంచారార్థం బయలుదేర
లేదుకద?
కనుచూపుమేర మనిషి కంపు లేదు.
మనకి కావలసిందీ అదే

మన కంట నరుడు పడకూడదు—
మనం నరుడికంట పడకూడదు—
పడ్డామా, ఉభయత్రా నష్టమేగాని లాభం లేదు.
ఎలక్ట్రిక్ దీపాలు ఎన్ని, ఎన్నెన్ని కారణాలవల్ల ఆరి
పోతున్నాయి కావు,
ఏదో ఒక దీపం వెలగటంలేదంటే,
దానికి, దారంట నడిచే మనిషిదా బాధ్యత?
ఛం ఛం! ఏమి టిదంతా?
చిన్నపనికి పెద్ద ఆలోచన,
పనికి సంబంధించికూడా కాదు,
అలాగని లేకపోలేదు, కొద్దిగా, సంబంధం ఉంది;
అయినా దానికింత చర్చ అనవసరం.
చూడగా చూడగా కామయ్య కథ చెప్పినట్టుంది.
కామయ్య కథ చెప్తానని మొదలుపెడతాడు,
కథ ఎప్పటికీ మొదలవదు
కాని, కబుర్లుమాత్రం జాస్తీ...
అప్పుడు నేనేం చేస్తూఉండేవాణ్ణంటే,
నాకిదెలా తెలిసిందంటే,
మా మామ బావమరిది ఒక డుండేవాడులే,
అప్పుడు నేనిలా ఉండేవాణ్ణికానులే,
కర్రపట్టుకొంటే పదిమందిని నిలబెట్టేవాణ్ణి,
అలా ఉంది మనపని—
అసలుపని మొదలుకాదు,
అక్కరలేని హడావిడి జాస్తి.
అబ్బే మరింక అట్టే ఆలస్యంలేదు—
దేనికయినా అసలు పనికంటె దానిగురించి ఆలోచించడమే గమ్మత్తు.
ఆ ఆలోచనకే ఎక్కువసేపు పడుతుంది.
తీరా మొదలుపెట్టేక ఆలోచనకే వ్యవధి ఉండదు.
మరిప్పుడు కొత్తగా ఆలోచించవలసిన దేమీలేదు;
అంతా నిశ్చయమే,
అందుకు మొదటిమెట్టు
వీధి వెలుగులేకుండా ఉండడం,

దానికి పెట్టుబడి అణాకాసు,
పక్కకి తప్పితే లాభంలేదు,
ఎందుకు తప్పిపోతుందీ,
అసలా అనుమానం ఎందుకు కలగాలీ?
ఇదుగో ఈ చెట్టునీడ బాగానే ఉంది.
అబ్బ! ఏమిటి కడుపులో గుడగుడలాడుతోంది!
ఆడదూ మరి, అరు విచ్చేడని అంత టిఫినుతింటే.
అసలీపూట ఏమీ తిని ఉండకపోవలసింది.
బాగానే ఉంది మాట
తినకపోతే శక్తి ఉండవద్దూ?
తినకపోతే నీరసం,
తింటే ఆయాసం!
ఈ ఆలోచనలన్నీ వ్యర్థప్రయాసం.
ఆకలివేసింది తిన్నాము,
అదీ ఒక పెద్ద నేరమా?
అంతమాత్రానికే బరు వెక్కవవుతుందా?
దీనిబాబు మేడలు చూసేను.
ఇదీ ఒక పెద్దఎత్తేనా?
ఆడది ఎక్కిపోగలదు!
అనుభవంలేని గుంటవెధవ అవలీలగా ఎక్కేస్తాడు.
కాని మరి ఆలస్యం ఎందుకు?
మనసులోనే అనుకొందాం...
ఒకటి, రెండు, మూడు,
దెబ్బ బాజోటు కాకూడదు, కాదుకూడా!
అదీ పనివాడితనం అంటే!
పెట్టిన అణా పెట్టుబడి వృధాపోలేదు.
బల్బు పూర్తిగా పగిలినట్టుకూడాలేదు
తక్కన వెలుగు తెగులుమాత్రం కట్టిపోయింది.
చీకటికి అలవాటుపడడానికి కళ్లకికొంత వ్యవధికావాలి
అంతవరకూ ఆగాలి.
ఇంతపర్యంతం సవ్యంగానే ఉంది
అంటే పని ఆవగింజలో అరవంతుకూడా కాలేదు.
కాని, ఇప్పటివరకూ అశుభసూచన లేవీ లేవుకదూ?
అదే చాలును.
మ్యునిసిపాలిటీవాళ్లు మేలుకొనేసరికి వారంపైగా పడుతుంది.
ఏమో, మేడాయన రేపే వేయించేస్తాడేమో?
ఎందుకు, ఈరాత్రే మరొక రెండుగంటలు పోయాక వెలిగించుకోమను.
మరింకా ఎందుకాలస్యం?
అన్నీ కనబడవలసినంత స్పష్టంగానూ కనబడుతున్నాయి.
తిన్నగా గేటులోంచి లోపలికి వెళ్లిపోయినా అడిగేవాడెవడూ లేడు.
అయినా అది మన సంప్రదాయంకాదు.
గోడదాటి వెళ్లడమే పద్ధతి.
టైమింకా పదకొండుకాలేదు.
పన్నెండు దాటేవరకు అతను రాడు,
కారుచప్పుడుకూడా ముందు వినిపిస్తుంది.
ఆ భయం ఏమీలేదు.
భయపడితే పనెలా జరుగుతుంది.
అన్నిటికీ సిద్ధపడే ఉండాలి.
గడ్డి బాగానే ఉంది.
కాలిగుర్తులూ అవీ స్పష్టంగా కనబడవు.
మేజోళ్లు తొడుక్కోడం మంచిదేగాని, కాలివేళ్లకి పట్టుదొరకదు.
చేతులకి 'గ్లౌసు' అంత ఇబ్బందిగాలేవు.
వేళ్లు విడిగానే ఉన్నాయి; కాని, పట్టు జారిపోదు కదా?
ఎన్నడూలేంది ఏమిటీ అనవసరమైనభయం?
భయంకాదు, అనుమానం,
ఏదయితేనేం, పని పాడుచెయ్యడానికి.
ఈరోజున పని పాడుకావడానికి వీల్లేదు.
ఆఖరి ప్రయత్నం,
అంతిమ విజయం,
ఎంతయినా సరే,
అది, ఇంకొకరకం బ్రతుక్కి పెట్టుబడికావాలి;
కాఫీహోటలు,
ఫేన్సీ దుకాణం,
అధమం కిల్లీకొట్టు—
ఏదో ఒకటి,
ఏదయినా సరే.
ఈ ఆయాసపు బ్రతుకు మరి లాభంలేదు.
అంటే ఇదొక పెద్దకష్టమనికాదు—
కాని, కొద్దిరోజులు వెలగడం, తరవాత మసిబారిపోవడం—
ఎప్పటికప్పుడు కొత్తకొత్తగా పథకాలు వేస్తూ ఉండడం—
ఇంతకంటె ఏదో ఒక స్థిరమయిన బ్రతుకుఉండాలి.
నరసింహ విలాస్ కాఫీక్లబ్బు—

లేదా,
నరసింహం అండ్ కో, ఫేన్సీ గుడ్సు మర్చెంట్సు—
లేదా,
నరసింహులు కిళ్లీషాపు...
హాయిగా దుకాణంమీద గల్లాపెట్టెదగ్గర కూర్చుం
టాడు.
రోజంతా అదే పని,
చుట్ట కాలుస్తూ, పళ్లు కుట్టుకొంటూ...
పనీపాటూలేని కొందరు తగుమనుషు లుండకపోరు!
ఒక రెండు బెంచీలు పడేయించేస్తే సరి,
కూర్చొని ఎక్కడలేని కబుర్లూ చెప్పిపోతూఉంటారు.
ఒకళ్లదగ్గర విన్న కబుర్లు ఇంకొకరితో చెప్తూ ఉండ
వచ్చును.
కూర్చున్న చోటినుండి కదలకుండానే సంగతులన్నీ
తెలుసుకోవచ్చును—
తెలుసుకొన్నవి అవలీలగా ప్రచారంచెయ్యవచ్చును.
మరి ఎంత ముసలికాలంవరకూ బతికినా బాధలేదు
నివురు గప్పిన నిప్పులా మీసాలు దువ్వుకొంటూ
కూర్చోవచ్చును.
మాణిక్యం కూడా అదే కావాలంటున్నాది.
నిజమే మరి!
దానికీ ముప్పై దాటే యంటుంది,
మరొక అయిదు కూడా ఉంటే ఉంటాయి!
పాపం, దానికీ వైధవ వృత్తి అంటే విరక్తిగా ఉంది.
ఎంతో కొంత,
నాలుగో మూడో రెండో, రోజుకి,
ఎంతయినా సరే
సర్దుకుపోతాను;
కలిసిఉందాం,
ముందు మాటేమిటి అన్న భయం ఉండకూడదు.
ముసలికాలంలో
నాకు నువ్వూ నీకు నేనూ;
బాగానే ఉంది గాని,
బుద్ధి కోతిలాటిది,
ఎప్పుడేం చేస్తుందో దానికి తెలీదు.
ఏమో ఈ బుద్ధి నిలబడేలాగే ఉంది.
అయినా ఈ ప్రాంతంలో ఎక్కడా కాకూడదు.
ఎక్కడికో దూరంగా ఎవ్వరికీ తెలియనిచోటికి—
తెలిసినవాళ్లు కనిపించి పేకాటకిరమ్మంటే కదలకపోడ
మెలాగ?

అటువంటిది మరేం కుదరదు
తగుమనిషి నరసింహులు!
దుకాణదారు నరసింహులు!
నమ్మకస్తుడు నరసింహులు!
గడ్డి నెమ్మదిగానే ఉంది.
చప్పుడు కావడంలేదు—
అయినా అడిగేవా డెవడూలేడు.
అయినా ముందునించి ఎక్కకూడదు.
కిటికీ నీడ,
పైకి పాకిన మాలతీ తీగ
చాలా బలంగా ఉంది—
కొంచెం ఎక్కితే చాలును,
పిట్టగోడ అందుతుంది.
కొంచెం లాఘవంగా గెంతితే చాలును.
బాగానే ఉంది;
కాని గదితలుపులు మూసుకొని ఉంటాయి.
మళ్ళీ అదొకపని
అంతకంటె నీటిగొట్టమే మంచి రహదారి.
పక్కగా ఉందికూడా
చెట్లు జీబుగా ఉన్నాయి.
గొట్టం ఒకచేత్తో పట్టుకొని రెండవచేత్తో కిటికీ అంచు
అందుకోవాలి.
దూరం అట్టేలేదు గాని,
రెండుచేతులూ చాపినా అంట్టేటులేదు.
ఆచెయ్యి విడిచి పెట్టడమూ ఇది అందుకోడమూ
ఒకేకాలంలో జరగాలి
ఒక్కక్షణం, క్షణంలో పదోవంతు
పొరపాటయితే
పడినపాటుకి కాలో చెయ్యో విరగవచ్చును;
పడ్డచోటునుండి కదలలేక పోవచ్చును.
ఛ! ఛ! ఏమిటీ పిచ్చిభయాలు?
ఇదీ ఒక పెద్ద దూరమేనా?
దీనికి నాలుగింతలు, ఎత్తులో ఇంతకు రెండింతలు,
దూరం గెంతేను.
ఆ రోజులు వేరు—
అప్పటి బలం వేరు;
ఆ సాహసం, ఆధైర్యం మరిరావు—
అయినా ఇవాళ మరి తప్పదు.
ఇలా మీనమేషాలు లెక్కపెట్టుకొంటూ కూర్చుంటే
సమయం మించిపోతుంది.

సాహసే లక్ష్మి!
గదిలో దీపం ఉన్నట్టే ఉంది.
కాని, పెద్దదిగాలేదు
ఉన్నవాళ్లు నిద్రపోతూ ఉండిఉంటారు.
లేకపోయినా భయంలేదు.
అరిచేప్రయత్నం జరగదు
భయంతో కళ్లు మూసుకోవాలి,
లేకపోతే భయపెట్టి నోరుమూయించాలి—
అదంతా అప్పటి సందర్భాన్నిబట్టి ఉంటుంది.
ప్రస్తుతం ఆలోచించవలసినదల్లా ఆ మేడ కిటికీని చేరుకోడం;
దానికింత ఆలోచనెందుకు
తల్లి చల్లగా చూడాలి
నడుం నులిగేవరకే చలి.
వెధవగొట్టం తుప్పుపట్టిపోలేదుకద?
బరువు కాస్తుందా?
కదలడం లేదుకద?—
ఉఁహుఁ దిట్టంగానే ఉంది.
మరేమీ భయంలేదు.
కిటికీ అందుకొన్నాక, అక్కడినుంచి అంతా గమనించవచ్చును.
పరిస్థితి బాగులేకపోతే,
మేలుకోనేఉంటే...
దిగి, ఒకగంటో అరగంటో ఆగి మళ్ళీ ఎక్కాలి.
అలా అయితే ఈ శ్రమఅంతా వృథా?
అలా ఎందుకవుతుంది?
దీపం చిన్నదిగానే ఉంది;
లోన ఉన్నది ఒంటరి ఆడమనిషి—
అయినా తాను అనవసరంగా భయపడుతున్నాడు;
నిజమే,
ఇకమీదట తానీవృత్తికి మరి పనికిరాడు
మాణిక్యం తనవృత్తికి మరి పనికిరానట్టే;
చేసేపనిమీద గౌరవం
చేస్తూండగా ఆనందం
ఉంటేనే పని బాగా సాగుతుంది
అంతే కాని,
ఇది నా పనికాదు,
దీని ఫలితాన్ని
ఇంకొకదానికి పెట్టుబడి పెడతాను
అని తలపోసినన్నాళ్లూ
అసలుపనికి అన్నీ వ్యాఘాతాలే—
నీటిగొట్టం బలంగానే ఉంది.
దానిలో నీరు కనబడకుండా మీదికి ఎక్కినట్లే
దానిని పట్టుకొని చరచరా ఎక్కిపోవాలి.
ఒకటి రెండు మూడు
అబ్బ, ఎంత చల్లగాఉంది;
అంతసేపు ఊరికినే తటపటాయించాను
అవలీలగా ఎక్కయగలిగాను!
కాని, ఇదేమిటి ఊపిరి
ఇంత బలంగా వస్తూంది?
ఒక్క రెండునిమిషాలే
కదలకుండా ఉండి, సర్దుకోవాలి;
లోపల సద్దేమయినా ఉంటేకూడా వినిపిస్తుంది.
అలికిడిఉన్నా అసలు పని మానేదిలేదు.
అయితే మరికొంచెం జాగ్రత్త అవసరం.
అబ్బ,
వెధవకిటికీ,
ఎంతదూరంగా ఉంది.
కిందనించి రెంటికీ అట్టే ఎడంలేదనిపించింది.
ఇప్పుడయినా భయంలేదు.
ఒక చెయ్యీ, ఒక కాలూ ఈ గొట్టాన్ని పట్టుకొని ఉండాలి.
ఒక్కగంతు ఛంగ్‌మని—అది తప్పితే?
తల పగులుతుంది.
కాని, తప్పదు—
తప్పడానికి వీల్లేదు,
ఇది ఆఖరుప్రయత్నం,
భగవంతుడి నిర్ణయం ఎలాగుంటే అలా అవుతుంది.
ప్రయత్నం మనం చేస్తాం
ఫలితం దైవాధీనం
ఇదేమిటీ వేదాంతం?
ఈ కిటికీని అందుకోడానికేనా ఇంత తబ్బిబ్బాను—
అంత భయం అయితే, ముందు దారినే రాలేకపోయావా?
తలుపు గడియ సంగతి ఎలాగో చూసుకోవచ్చును.
లేదా, ఇంటిమనిషిలాగే తలుపు చప్పుడు చెయ్యడం
కిందనున్న బంట్రోతు లేచివస్తే,
ఛఁ ఛఁ, అదంతా పనికిరాదని నిశ్చయించేముకదూ!
ఇదే బాగుంది.
అమ్మయ్య!

ఇప్పటికి ఊపిరి సర్దుకొంది.
కిటికీ అందినా చెయ్యి జారకుండా ఉండాలి.
లోపలి మనిషి మేలుకొనిఉంటే అంచును పట్టుకొనే
ఉండాలి;
ఇటునించటు వెళ్ళడంకంటె అటునించిటు రావడం
మరీ కష్టం;
కిటికీ చువ్వలు అందుకొంటే బాధ లేదు.
ఎంతసేపయినా వేళ్ళాడవచ్చును.
లోపలికి పోగానే గది తలుపు గడియ తియ్యాలి.
ఆతరవాత తక్కినపని సావకాశంగా చేసుకోవచ్చును
లోపలివాళ్లు నిద్రపోలేదేమోనని విచారం ఎందుకు?
ఒకవేళ నిద్రపోయి ఉంటే లేపవలసి వస్తుంది కూడా
ఏమో?
భయపెడితే లొంగిపోయే రకంలాగే ఉంది.
స్వయంగా అన్నీ వెతకాలంటే చాలాకష్టం.
అయితే, తాళాలు దొరికి,
మన పనికి ఏమీ అడ్డులేకపోతే
ఎందుకూ నిద్ర లేపడం?
హాయిగా నిద్రపోనీ—
నేనూ పోయి హాయిగా నిద్రపోతాను.
నిద్రపోడమా?
అదెలా కుదురుతుంది?
ఏమో మాణిక్యం ఏమంటుందో?
అదేమంటుంది?
మన మేమంటే అంతే అంటుంది—
ఈ తెల్లవారుజాము బండీలోనే బయలుదేరిపోతే—
తరవాత చెయ్యవలసిన పనులను గురించిన పాడు
ఆలోచనలు—
ముందు కిటికీ అంచును అందుకోవాలి
అంతే
కిటికీ అంచు
నీటిగొట్టం
ఒక ఆధారాన్ని విడిచి ఇంకొకటి అందుకోడం
ఒకటి రెండు మూడు—
అరె, ఏమిటీ జంకు
రెండుమార్లు వెనక్కి తగ్గిపోయాను—
ఇంత చేతకానితనమా?
లేదు, లేదు, లేదు,
హనుమంతుడి దయ—
అమ్మవారి చల్లనిచూపు
అంతే
మరి ఒకటి రెండు మూడు లేదు.
ఒకటే ఎగురు
హాస్
హూ, హూ!
అబ్బ ఏమిటి ఊపిరి...
అందింది.
కాని,
అబ్బ,
శరీరం ఎంతబరువుంది!
అంచుని వేళ్ళతో పట్టుకుని వేళ్ళాడ్డం మరి లాభంలేదు;
కనిపిస్తే చెయ్యి కనబడనీ
ఆఁ కిటికీ గజం దొరికింది
ఇక నీ చెయ్యి విడిచిపెట్టినా భయంలేదు.
లోపల ఏమయినా అలజడి బయలుదేరుతుందేమో
చూద్దాము!
కొంతసేపు చూడాలి
అప్పుడు రెండవచేత్తో కూడా కిటికీ గజాలు పట్టుకొని
మీదికి లేవాలి.
ఎంతసేపిలాగ?
మేలుకొనిఉండి, కిటికీనే చూస్తూఉంటే...
కలవరపడడానికీ సమయం చాలును.
గదిలోపల ఏగొడవా లేదు
అంతా, మన మనసులోని ఆందోళనే.
ఆఁ! రెండవచెయ్యికూడా పట్టు అందింది.
ఒక్కక్షణం ఆగి,
నెమ్మదిగా తల పైకెత్తాలి.
ముందు అంతా కలియజూడాలి.
ఆతరవాత పని ప్రారంభించాలి.
కిటికీమధ్య కర్ర పాతబడినట్టే ఉంది—
కాని, పావుగంట పడుతుందో అరగంట పడుతుందో?
చప్పుడుకాకుండా కన్నాలుచేసి, మధ్య మిగిలిన
ముక్కలను కత్తితో కొయ్యాలి.
అంతా ఒంటిచేత్తో చెయ్యాలి.
ముందు లోపలిసంగతి కళ్లతో చూడాలి.
అరె, మంచంమీద ఎవ్వరూ లేరు!
గది తలుపు లోపల వేసినట్టే ఉంది.
గదిమధ్యను కుర్చీ
పక్కను తలక్రిందులుగా స్టూలు.
ఆఁ! ఆఁ! ఏమిటిదీ!

నిజమే,
గదిదూలంనుంచి మనిషి వేళ్లాడుతున్నా డేమిటి?
ఎంతసేపయిందో?
గబగబా వెళ్లాలి
ప్రాణం పోయిందేమో?
పోనీ మనపనికి ఏ అడ్డూ ఉండదు
ఇంకా కొనప్రాణం ఉందేమో,
త్వరగా లోపలికి ప్రవేశించగలిగితే,
వెధవకర్ర, ఊడిరావడానికి ఎంతసేపు పడుతుందో,
పాతబడి ముక్కిపోయింది,
మధ్యనే కొంతపట్టు ఉంది.
గట్టిగా ఊపితే,
అమ్మయ్య, కదిలింది, గాని,
మనకత్తితో అటు ఇటూ రెండునరుకులు పెడితేసరి—
ఆఁ, ఇంకారాదా?
కర్ర ఊడిందిగాని, పట్టు తప్పిపోవలసింది.
మీదను అలాగే ఉండనీ
గట్టిగా పక్కకు తప్పించేస్తే
వంగితే వంగుతుంది
ఊడినా బాధలేదు.
అమ్మయ్య! అడ్డుతీరింది.
ఒళ్లింకా వేడిగానే ఉంది.
ఎంతోసేపయినట్టులేదు,
కిందను అటా ఇటా అని అంతసేపు తర్జన భర్జన
చెయ్యడం పొరపాటు.
పదినిమిషాలు ముందువచ్చి ఉంటే?
ఇప్పటికయినా మించిపోయిందిలేదు.
తెలివి తప్పిపోయింది, అంతే;
కాని, తాడు ముడి సరిగాలేదు,
బాగా బిగుసుకోలేదు.
కుర్చీమీదనుంచి అందుతుందా
బల్ల వేసుకొంటే
మనిషిని పట్టుకొని జాగ్రతగా దింపాలి.
మనిషిని పడిపోకుండా ఒకచేత్తో పట్టుకొని, ఒకచేత్తో
తాడుకొయ్యాలి.
పాపం, ముప్ఫైఏళ్లయినా ఉంటాయో ఉండవో?
ఎందుకింత సాహసానికి పూనుకొందో?
భార్యాభర్తలకి పడకపోయి ఉంటుంది.
వింతేముంది?
అతని సంచారం అంతా వేరే సీతాకోక చిలకలతో—

అమ్మయ్య!
తాడు తెగింది.
జాగ్రత్తగా దిగాలి.
మంచంమీద పడుకోబెట్టాలి.
తాడేగాని సరిగా బిగుసుకొనిఉంటే ఏమీ లేకపోవును;
ఏంచెయ్యాలిప్పుడు?
మొగంమీద నీళ్లుజల్లితే
తెలివి వస్తుందో రాదో?
ప్రాణంమాత్రం పోలేదు
అంతవరకు నిజం!
పీకచుట్టూ నరుకుపడింది,
ఏంచెయ్యడం?
మనమేంచేస్తాం, మనపని చల్లగా చేసుకుపోతేసరి...
పాపం! కొంచెం జాగ్రత్త తీసుకొంటే—
ఒక నిండుప్రాణి బ్రతకడానికి వీలుంటుందేమో?
డాక్టరు,
డాక్టరు ఎక్కడున్నాడు?
ఎలా వస్తాడు?
వచ్చి ఏంచేస్తాడు?
ఏమయినా చేస్తాడు
కృత్రిమంగా శ్వాస కల్పిస్తాడు
ఏం చేసినా సరే
డాక్టరు వచ్చినతరవాత మరి విచారం ఉండదు.
అయినా అది మనవల్ల అయేది కాదు
ముందు మొగంమీద కొంచెం నీళ్లు జల్లితే!
ఈమూలను కూజాలో ఉన్నాయేమో?
ఆఁ ఉన్నాయి,
గ్లాసు?
నీళ్లు జల్లి తువ్వాలుతో తుడిచి...
ఆఁ ఆఁ
ఏమిటే చప్పుడు
తలుపు చప్పుడే
గబగబా తప్పుకోవాలి
కిటికీలోంచి దిగి, నీటిగొట్టాన్ని అందుకోడం
కష్టమేగాని,
మరి గత్యంతరం లేదు.
తలుపు చప్పుడు చాలా ఎక్కువవుతూంది.
ఇవాళ అంతా రసాభాసుగానే ఉంది.
మొదట్లో జంకడమే అశుభసూచన.
దిగిపోతాం,

తప్పుకొని పారిపోతాం;
తలుపు తట్టితట్టి,
పగలగొట్టి,
లోపలికి రావాలి,
అప్పుడు డాక్టరుకి కబురు చెయ్యాలి,
అంత ఆలస్యం అయితే డాక్టరు వచ్చినా ఉపయోగం
ఉండదేమో?
అంతకంటే
ఎందు కనవసరమైన భయం?
ఏంచెయ్యగల దేమిటి?
తలుపు తీస్తాము——
అదుగో! చావాలని ఉరిపోసుకొంది!
ఇంకా ప్రాణం ఉంది,
డాక్టర్ని పిలవండి!
బతకొచ్చు——
నామాటకేం
మనిషి ప్రాణం కాపాడండి!

* * * *

మీరేం చేస్తారు?
నిన్నను ఎందుకలా చేసేనో నా కర్థంకాదు.
నిన్నటితో ఈ బ్రతుక్కి ఆఖరనుకున్నాను.
పెద్దమనిషిలాగ,
దుకాణదారుడులాగ
కుటుంబస్థుడుగా
ఇకముందు బ్రతకాలనుకున్నాను;
కాని, భగవదిచ్ఛ వేరుగాఉంది;
నా గత నేరాలకు శిక్ష
అనుభవించకపోరాదు కాబోలు!
అయినా నాకు పెద్ద విచారంలేదు,
ఇక్కడనుంచి బైటపడ్డాక
మరి సుఖంగా బ్రతకాలని చూడను
ఏదో విధంగా శ్రమించి జీవిస్తాను,
ఇంతకీ
నిన్నటి నా ప్రయత్నానికి ఫలితం
ఒక నిండుప్రాణం దక్కడం!
మీ యిష్టం
ఇప్పటికీ నా నిన్నటి ఆలోచనకి అవకాశం ఉందం
టారా?
ఏమో నేనేమీ కోరను
నిన్నను నే ననుకొన్నదా?
ఎందుకు మీకా లెక్క——
ఒక వెయ్యికి తక్కువ ఉండదనుకున్నాను.
అంత పెద్ద మొత్తం మీరెందుకు నా కివ్వాలి?
నేను సంపాదించుకొనిఉంటే అది వేరే సంగతి.
నేనుచేసిన ఉపకారమా?
నాకేం నమ్మకంలేదు.
మీకు మనసు మార్చిందెవరు?
ఆ భగవంతుడే నన్నా వేళకి అక్కడికి తీసుకొని
వచ్చేడు.
అంతేకాదు,
తాడు ముడి సరిగా బిగుసుకొనిఉంటే
ఎవరూ ఏమీ చేయలేకపోయేవారు.
పోనీ,
మరెందుకదంతా
డాక్టరు మరేంప్రమాదం లేదన్నాడుకదా?
అంతా భగవదిచ్ఛ!
ఏమిటేమిటి?
ఆ భగవంతుడే నన్నిప్పుడు మీకార్లో మీయింటికి
రమ్మంటున్నాడా?
పోలీసులు?
మీకు తెలీదు,
మీరు కేసు మానుకొంటామన్నా వాళ్లు వదులుకోరు;
సర్కిల్ ఇన్‌స్పెక్టరు మీ స్నేహితుడా?
అయినా,
సరే,
మీఇష్టమే కానీండి
నిన్నను నాకాబుద్ధి పుట్టించినవాడే
నేడు మీకీబుద్ధి పుట్టిస్తున్నాడు——
అబ్బే ఇందులో వేదాంతం ఏముంది?
మనం మానవమాత్రులం
ప్రయత్నాలు మనవంతు
ఫలితాల నిర్ణయం——
ఎవరివంతో కార్లో చెప్పుకొందామంటారా?
నాకిదంతా ఏమిటో కలలాగే ఉందిసుమండీ!
మీకూనా?
సరిపోయింది!
మొత్తానికి
నిన్నటి నా చివరిప్రయత్నం నిష్ఫలంకాలేదు——
మీఅదృష్టమూ కాదు నాఅదృష్టమూ కాదు; భగవదిచ్ఛ!